క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్లపై సిబ్బందికి శిక్షణ



గొల్లప్రోలులో సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

పిఠాపురం: గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో గురువారం ధాన్యం కొనుగోలుపై వ్యవసాయశాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. గొల్లప్రోలు మండలం, నగర పంచాయతీల్లో తొమ్మిది ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నియమించిన సిబ్బందికి పౌర సరఫరాల శాఖ టెక్నికల్ టీం కిషోర్, సురేష్ ,పోసిన సత్యశ్రీ శిక్షణ ఇచ్చారు. ధాన్యం కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఏవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు .

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, గోర్స, కొండెవరం, రమణక్కపేట, నాగులపల్లి, పాత ఇసుకపల్లి, కొత్త ఇసుకపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లకు మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ శంకుస్థాపనలు చేశారు. జనసేన నాయకుల జ్యోతుల శ్రీనివాస్, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు రావు అక్షయ్, అనిశెట్టి సత్యానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



కొమరగిరిలో వెంకటలక్ష్మిని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ గీత

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మృతుల కుటుంబాలను గురువారం మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత పరామర్శించారు. మండలంలోని కొమరగిరి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు, పిఠాపురం మార్కెట్ యార్డు డైరెక్టర్ నరుకుర్తి వెంకటలక్ష్మి భర్త నరుకుర్తి ప్రకాష్‌రావు ఇటీవల మృతి చెందారు. దీంతో వెంకటలక్ష్మిని మాజీ ఎంపీ వంగా గీత పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన పలువురు మృతుల కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైస్ ఎంపీపీ సురేష్‌కుమార్, కారే శ్రీనివాస్, ఉమ్మిడి జాన్, ఎంపీటీసీ మెరుగు ఎల్లాజీ, బొందు రాంబాబు, వద్ది నాగమణి, గింజాల శ్రీనివాస్, గోపి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఏఈగా రమేష్‌బాబు



సామర్లకోట: కొత్త మున్సిపల్ ఏఈగా రమేష్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత రెండేళ్లుగా ఏఈ పోస్టు ఖాళీగా ఉండటంతో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాగర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కాకినాడ కార్పొరేషన్ నుంచి రమేష్‌బాబును సామర్లకోట మున్సిపాలిటీకి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటికి అత్యంత ప్రాధాన్యమిస్తూ, స్వచ్ఛమైన తాగు నీరు ప్రజలకు అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నట్టల నివారణకు చర్యలు



గొర్రెలకు నట్టల నివారణా మందు వేస్తున్న పశువైద్యులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో గొర్రెలు, మేకల్లో నట్టల నివారణ కార్యక్రమాన్ని కాకినాడ డీడీ డాక్టర్ ఈడీబీఆర్ అంబేడ్కర్ గురువారం ప్రారంభించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకల పెంపకంలో తీసుకువాల్సిన జాగ్రత్తలు, నటల నివారణ ప్రాముఖ్యతను రైతులకు తెలియజేశారు. పశువుల్లో అంతర పరాన్నజీవుల నివారణ మందులు అందజేశారు. డాక్టర్ ఆర్.హిమజ సుమారు 1000 గొర్రెలు, మేకలకు నట్టల నివారణా మందును వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు నట్టలు, అంతర పరాన్న జీవులు హాని కలిగిస్తాయన్నారు. పశువుల ఆరోగ్యం క్షీణించడమే కాకుండా ఒక్కోసారి వాటి మరణానికి కూడా కారణ మవుతాయన్నారు. నట్టలు ఉన్న జంతువుల్లో ఆకలి తగ్గుతుందని, మందలో నీరసంగా నడుస్తాయన్నారు. ఇలాంటి లక్షణాలు ఉన్న వాటిని మంద నుంచి వేరు చేసి తగిన మందులు వేయించాలని రైతులకు సూచించారు. పశువులకు ప్రతి 6 నెలలకు ఒకసారి పరీక్షలు చేయించాలన్నారు. పశువుల ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో పశుసవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అట్లతద్దోయ్.. రేటెంటోయ్..

- పండగలంటే భయపడుతున్న జనం
- ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు
- అదనపు భారంగా ప్రయాణాల ఖర్చులు
- కుటుంబ ఆదాయం పెరగడం లేదని గృహిణుల ఆవేదన
- పుట్టింటికి ప్రయాణమవుతున్న మహిళలు

సామర్లకోట: పండగ వస్తుందంటే జనం భయపడాల్సిన రోజులొచ్చాయి. ఇళ్లకు చుట్టాలొస్తుంటారు. ఇల్లంతా బంధుమిత్రులతో కళకళలాడుతుంటుంది. అయినా.. ఆ ఆనందం కంటే పెరిగిపోయిన నిత్యావసరాల ధరలతో బెంబేలెత్తాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయాణాలు, అతిథి మర్యాదలు, పిండివంటలు, భోజనాలు, పూజలు.. నోములు ఇలా ప్రతీది ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే. పూర్వపు రోజులతో పోలిస్తే.. అప్పట్లో ఆనందోత్సాహాలతో గడిపే పండగలు, పర్వదినాలు.. ప్రస్తుతం గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి.

గతంలో ఎన్నడూ లేని విధంగా నిత్యావసర వస్తువుల ధరలు మండిపోతున్నాయి. ఆశ్వయుజ బహుళ తదియ రోజున మహిళలు ఉత్సాహంగా అట్లతద్ది నోము చేసుకోవడం ఆనవాయితీ. దసరా పర్వదినం తర్వాత వచ్చే అట్లతద్దిని శనివారం చేసుకోవడానికి మహిళలు సిద్ధమవుతున్నారు. గౌరీదేవిని పూజించి, అట్లను నైవేద్యంగా పెట్టాల్సి ఉంటుంది. అట్లు ప్రధానం కావడంతో ఈ పండగను అట్లతద్దిగా పిలుస్తారు. నవధాన్యాలను తాటాకు బుట్టలో ఉంచి, మొలకెత్తిన జాజాలను నీటిలో విడిచి పెడతారు. అట్లు వేసే బియ్యాన్ని మిల్లులో పిండి ఆడిస్తారు. ఈ నేపథ్యంలో పిండి మిల్లుల వద్ద జనం రద్దీ పెరిగింది.



తాటాకు బుట్టలో మొలకలు వచ్చిన జాజాలు



పిండి మిల్లు వద్ద వేచి ఉన్న జనం

తడిసి మోపుడైనా తప్పని ప్రయాణం

పెళ్లయిన మహిళ పుట్టింట్లో అట్లతద్ది చేసుకుని, వాయినాలు ఇవ్వవలసి ఉంటుంది. పెళ్లయ్యాక సుదూర ప్రాంతాల్లో ఉన్నా ఆమె పుట్టింటికి వెళ్లి, పండగ చేసుకోవడం అనవాయితీ. ఇటీవల సామర్లకోట మీదుగా వెళ్లే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడం, రైళ్లలో రిజర్వేషన్ బోగీల సంఖ్యను కుదించడం, ఏసీ బోగీల సంఖ్య పెంచడంతో ప్రజలకు రైలు ప్రయాణం భారంగా మారింది. దీనికితోడు పండగ సీజన్ కారణంగా రైళ్లలో రద్దీ పెరగడంతో.. ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రయాణ ఖర్చు తడిసి మోపుడైనా కచ్చితంగా ఊళ్లకు వెళ్లాల్సి రావడంతో, జనానికి అదనపు భారం తప్పడం లేదు.



ప్రయాణికులతో కిక్కిరిసిన సామర్లకోట రైల్వే స్టేషన్

గణనీయంగా పెరిగిన ధరలు

దీనికితోడు పండగ రోజున వివిధ రకాల పిండి వంటలు తయారు చేసుకోవడం సర్వసాధారణం. అట్లతద్ది కోసం వంటనూనె వినియోగం ఎక్కువగా జరుగుతుంది. కొంతకాలం క్రితం లీటరు రూ.105 ఉండే వంట నూనె ప్రస్తుతం రూ.140కి చేరింది. అదేవిధంగా పిండి వంటల్లో వినియోగించే బెల్లం, పప్పులు, అపరాల ధరలూ ఆకాశాన్నంటుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యావసర సరకుల వివరాలిలా..

సరకులు	ప్రస్తుత రేటు (రూ.ల్లో)	నెల రోజుల క్రితం (రూ.ల్లో)
వంట నూనె కేజీ	140	105
బెల్లం కేజీ	55	50
బియ్యం పిండి కేజీ	40	30
గోధుమ నూక కేజీ	90	70
గోధుమ పిండి కేజీ	50	40
అరటి పళ్లు డజను	60	50
కొబ్బరి కాయ	30	20

చౌక దుకాణాల ద్వారా గోధుమలు, పంచదార, వంటనూనె ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. సరకుల సరఫరా సమయం ముగిసినా. ఇప్పటికీ వాటి ఊసే లేదని మహిళలు మండిపడుతున్నారు.

ప్రత్యేక పూజలు

అట్లతద్దిని పురస్కరించుకుని స్థానిక పంచారామ క్షేత్రమైన శ్రీబాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. ఇందుకు తగ్గట్టుగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

మహిళల్లో ఉత్సాహం



మహిళలు మాత్రమే చేసుకునే పండగ అట్లతద్ది. ఎంతో ఉత్సాహంగా మహిళలు ఈ పండగను చేసుకుంటారు. ఈ పండగ కోసమే పుట్టింటికి రావడం జరిగింది. గోరింటాకు పెట్టుకుని, నవధాన్యాలతో జాజాలను తయారు చేస్తారు. పెళ్లయిన మహిళ ఐదేళ్ల పాటు అట్లతద్ది నోము చేసుకుని, వాయినాలు ఇవ్వాల్సి ఉంటుంది. పండగ వేళ ఖర్చులు పెరుగుతున్నాయి.

– మచ్చా బిందు, గృహిణి, వీకే రాయపురం

ఇప్పుడు భయం వేస్తోంది



పండగలంటే భయం వేస్తోంది. చిన్నతనంలో అట్లతద్ది అంటే వారం రోజుల నుంచి ప్రతి ఇంటిలోను సందడి ప్రారంభమయ్యేది. కానీ ప్రస్తుతం ఆ సందడి కనిపించడం లేదు. పిండివంటలు తయారు చేయడానికి నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా వంట నూనె రూ.40 వరకు పెరిగింది. కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కుటుంబ ఆదాయం మాత్రం పెరగడం లేదు.

– చల్లా కుమారి, గృహిణి, సామర్లకోట

సైన్స్ శిక్షణ కేంద్రం పరిశీలన



సైన్స్ ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎంబీవీకే ప్రతినిధులు

పెద్దాపురం: పట్టణంలోని రామారావుపేటలో ఉన్న అల్లం రాజు చారిటబుల్ (ఏసీటీ) శిక్షణ కేంద్రంలో కియా అసోసియేషన్ సంస్థ ప్రతినిధి బుద్దా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నడుస్తున్న సైన్స్ శిక్షణ కేంద్రాన్ని గురువారం విజయవాడకు చెందిన మాకినేని బసవపున్నయ్య (ఎంబీవీకే) విజ్ఞాన కేంద్ర బృందం పరిశీలించింది. విజయవాడకు చెందిన ఎంబీవీకే చైర్మన్ పి.మధు, కార్యదర్శి పి.మురళీకృష్ణ పరిశీలించి ప్రతి వారం ఉచితంగా సైన్స్ శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. సైన్స్ చేతి ద్వారా నేర్చుకోవడం వల్ల విద్యార్థుల శాస్త్రీయ ఆలోచనలకు పదును పెట్టినట్టేనని బృందం ప్రతినిధులు చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు కూనిరెడ్డి అరుణ, సైన్స్ ల్యాబ్ సహాయకులు సునీత పాల్గొన్నారు.

వరిలో తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి



తాటిపర్తిలో రైతులకు సూచనలిస్తున్న అధికారులు

పిఠాపురం: ప్రస్తుత సీజన్‌లో వరి పంటను ఆశించే తెగుళ్ల నివారణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సోమయాజుల సీతారామశర్మ రైతులకు సూచించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో పలు పంటలను గురువారం వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పైరును ఆకుముడత, దోమపోటు తెగుళ్లు ఆశించినట్టు గుర్తించారు. ఎలుకల బెడద కూడా ఎక్కువగా ఉందన్నారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్య రక్షణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు, ఉద్యానశాఖ అధికారి గోవిందరాజులు పాల్గొన్నారు.

మలినాల ప్లాంటు వద్దంటూ నిరసన

- వాగ్వాదానికి దిగిన మహిళలు
- కమిటీ సమావేశం వేస్తామని కమిషనర్ హామీ



కమిషనర్ ఎదురుగా బైఠాయించిన ఆందోళనకారులు

సామర్లకోట: మనిషి మలినాలతో తయారు చేసే ఎరువుల ప్లాంటు నిర్మాణం చేయవద్దంటూ బ్రౌన్‌పేటకు చెందిన ప్రజలు గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. 2023లోనే కౌన్సిల్ తీర్మానం అయిందని, దాని ప్రకారం ప్లాంటు నిర్మాణం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ స్పష్టం చేశారు. దీంతో బ్రౌన్‌పేట, గణేష్‌కాలనీ, యానాదుల కాలనీ ప్రాంతాలకు చెందిన వారు మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ప్రజల ప్రాణాలకు హాని కలిగించే పరిశ్రమ తమ ప్రాంతంలో వద్దని నినాదాలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ స్థలాలున్నాయని, వాటిలో పరిశ్రమ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. సుమారు 30 ఏళ్ల క్రితం ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం సెంటున్నర వంతున స్థలమిస్తే, అందులో ఇళ్లు నిర్మించుకుని జీవిస్తుండగా, అక్కడ సెప్టిక్ ట్యాంకర్లతో వర్థాలు తీసుకొచ్చి, దానితో ఎరువులు తయారు చేయాలని నిర్ణయించడం ఎంత వరకు సమంజసమని జిల్లా మానవ హక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ ప్రశ్నించారు. వ్యర్థాలతో ట్యాంకులు వెళ్లే సమయంలోనే భరించలేని దుర్వాసన వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రౌన్‌పేట ఏరియాల్లో పరిశ్రమ ఏర్పాటు ఆలోచన విరమించుకోవాలని, బలవంతంగా ఏర్పాటుకు సిద్ధమైతే, ప్రాణాలర్పించడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. మున్సిపాలిటీలో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. ఈ క్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ శ్రీవిద్య మాట్లాడుతూ, గతంలో కౌన్సిల్ తీర్మానం మేరకు పరిశ్రమ ఏర్పాటు చేయాలని సూచించినట్టు చెప్పారు. ఈ పరిశ్రమతో ఎటువంటి హాని ఉండదని స్పష్టం చేశారు. ప్రజల అభ్యంతరాల మేరకు కౌన్సిల్ సభ్యులు, ఉన్నతాధికారులు, ఆ ప్రాంత ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అప్పటి వరకు పనులు ప్రారంభించబోమని కమిషనర్ హామీ ఇచ్చారు. దాంతో ఆందోళనకారులు శాంతించారు. మున్సిపల్ టీపీఓ మంజుల, మున్సిపల్ మేనేజరు టి కనకరాజు, కౌన్సిలర్లు నేతల హరిబాబు, మర్రి శేషారావు, పాలిక చంటిబాబు ఉన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

పెద్దాపురం: ఆదికావ్యాన్ని రచించి మానవ సమాజానికి రామాయణాన్ని అందించిన ఘనత వాల్మీకిదని పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి అధ్యక్షత వహించారు. వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, డీఈ ప్రకాశరావు, కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, త్సలిక సత్యభాస్కర్, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ పాల్గొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ శ్రీరమణి వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన వేషధారణలు





దేవతామూర్తుల వేషధారణలు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ శివారు సూరంపేట దుర్గాదేవి ఆలయం వద్ద గురువారం పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. దేవీ శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపులో భాగంగా సంప్రదాయ, దేవతామూర్తుల వేషధారణలో గ్రామోత్సవం నిర్వహించారు. దేవతామూర్తుల వేషధారణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు

కొత్తపల్లి: మండలంలోని కుతుకుడుమిల్లి, కొత్తపల్లి గ్రామాల్లో గురువారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ కాకినాడ జిల్లా ఇన్‌చార్జి రావూరి లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

అనంతరం పలువురికి సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ బీవీ కృష్ణరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, గండి కొండలరావు, కె.గంగరాజు, రాష్ట్ర చేనేత సెల్ కో కన్వీనర్ రవణం సుబ్రహ్మణ్యం, మండల అధ్యక్షుడు ఎకరం రామసుబ్బారెడ్డి, ఆడబాల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మంచి వైద్య సేవలు అందించాలి

సామర్లకోట: సీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సదుపాయాన్ని అందజేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. గురువారం ఆయన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆస్పత్రిలో సమస్యలను తన దృష్టికి తేవాలన్నారు. ప్రతి నెలా తప్పనిసరిగా కమిటీ సమావేశం నిర్వహించాలన్నారు. రోగులకు కావాల్సిన మందులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. కమిటీ సభ్యులుగా ఎంపికైన రామలక్ష్మి, చంద్రశేఖర్, దుర్గాప్రసాద్‌తో ఆస్పత్రి సూపరింటెండెంట్ అమల ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ కంటే బాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, లారీ ఓనర్ల సంఘ మాజీ అధ్యక్షుడు ముత్యం రాజబాబు, డాక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా మండల పరిధిలోని అనేక గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సామర్లకోట, మాధవపట్నం, వేట్లపాలెం గ్రామాలలోని సబ్ స్టేషన్ల మరమ్మతుల కారణంగా వేట్లపాలెం, జి.మేడపాడు, హుస్సేన్‌పురం, మాధవపట్నం, వీకే రాయపురం, గొంచాల, బోయనపూడి, ఉండూరు, పి.వేమవరం, కాపవరం, నవర, చంద్రంపాలెం, పవర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

మూడు గ్రామాల్లో పల్లె పండుగ



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెద్దాపురం: గ్రామీణ ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకే పల్లె పండుగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. కాండ్రకోట, గోరింట, వడ్లమూరు గ్రామాల్లో గురువారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీలలిత అధ్యక్షత వహించారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కనకదుర్గ ఊరేగింపు

సామర్లకోట: శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని గురువారం స్థానిక పాత్రుళ వీధిలో నిర్వహించిన కనకదుర్గ అమ్మవారి ఊరేగింపు భక్తిశ్రద్ధలతో జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఏర్పాటు చేసిన అమ్మవారి ఊరేగింపును రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆవాల రాజేశ్వరి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేయగా, భారీఎత్తున బాణసంచా కాల్పులు, బ్యాండ్‌మేళం, డ్యాన్సులతో కొనసాగింది. కమిటీ నాయకులు పెదిరెడ్ల కృష్ణ, బొడుగు ప్రసాద్, ఎలిశెట్టి శివాజీ, కర్రి ఉమామహేశ్వరరావు, కర్రి విజయ్, రామకృష్ణ, పెదిరెడ్ల రాజు తదితరులు భక్తులకు సేవలందించారు.

తీరంలో అలజడి

- అల్పపీడనం ప్రభావంతో ఎగసిపడుతున్న అలలు
- కోతకు గురవుతున్న మత్స్యకార గృహాలు
- భయాందోళనలో మత్స్యకారులు

కొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం ప్రభావంతో తీర ప్రాంతంపై కడలి కన్నెర్ర చేస్తోంది. ఉప్పాడ తీరంలో అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. దీంతో తీరంలో సురడపేట, జగ్గారాజుపేట, మాయాపట్నంలో మత్స్యకారుల గృహాలు కోతకు గురవుతున్నాయి. గత రెండు రోజులుగా అల్పపీడనం ప్రభావంతో మండలంలోని తీరప్రాంత గ్రామాలైన ఉప్పాడ, కోనపాపపేటల్లో కడలి అల్లకల్లోలంగా మారింది. కెరటాల తాకిడికి మత్స్యకార గృహాల్లోకి సముద్రపు నీరు చొచ్చుకు రావడంతో మత్స్యకారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గృహాలతో పాటు వృక్షాలు, రోడ్లు, విద్యుత్ స్తంభాలు సముద్ర గర్భంలో కలుస్తున్నాయి. దీంతో మత్స్యకారులు గృహాలను విడిచి సామగ్రితో సురక్ష ప్రాంతాలకు తరలి వెళ్తున్నారు.

బీచ్‌రోడ్డులో..

కెరటాల ఉధృతికి బీచ్‌రోడ్డులో రక్షణగా వేసిన బండ రాళ్లు సైతం కోతకు గురై రోడ్డుమీదకు పడుతున్నాయి. అలలు రోడ్డు మీదకు ఎగసి పడుతుండడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. కాగా అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో జన జీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లపై వర్షపు నీరు పొంగి పొర్లుతోంది. వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తీరప్రాంతంలో ఉన్న అధికారులను జిల్లా యంత్రాంగం అప్రమత్తం చేసింది.



ఉప్పాడలో కన్నెర్ర చేస్తున్న కడలి



ఉప్పాడ జగ్గరాజుపేటలో కోతకు గురైన మత్స్యకార గృహాలు



గృహాలను ఖాళీచేసి సామగ్రితో సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్తున్న మత్స్యకారులు



ఉప్పాడలో ఇళ్లలోకి వస్తున్న సముద్రపు నీరు



ఉప్పాడలో సముద్ర గర్భంలో కలుస్తున్న తీర రోడ్డు

తీర ప్రాంతంలో పర్యటించిన ఆర్డీఓ



ఉప్పాడలో కోతకు గురవుతున్న మత్స్యకార గృహాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ మల్లిబాబు

కొత్తపల్లి: ఉప్పాడ తీర ప్రాంతంలో గురువారం ఆర్డీఓ మల్లిబాబు పర్యటించారు. కోతకు గురవుతున్న మత్స్యకార గృహాలను, బీచ్ రోడ్డును పరిశీలించారు. కోతకు గురవుతున్న గృహాల్లో ఉన్న మత్స్యకారులను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దారు చిన్నారావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.